

# జీవనవనం

— విజయ

సాయంత్రం ఆరున్నర కావస్తూంది. సూర్యుడు తన డ్యూటీ ముగించుకొని కొండల్లోకి జారుకుంటున్నాడు. చీకటి తెరలు తెరలుగా వ్యాపిస్తూంది. ఆఫీసు నుండి అలా సుబ్బారావు ఇంటికి వెళ్ళి, కాసేపు హస్కు కొట్టి ఇంటికి బయలుదేరాడు సూర్యం. “సాయంత్రం ఆఫీసు నుండి డైరెక్టుగా ఇంటికి రండి” అని ప్రతి రోజూ శ్రీమతి చెప్పడం తను ఇలా ఆలస్యంగా ఇంటికి రావడం మామూలే. కాలనీ మలుపులో సిటీ బస్ దిగి ఇంటి వైపు నడిచాడు.

“ఆఫీసు నుండేనా రావడం” అంటూ విష్ చేశాడు ఎదురింటి వెంకట్రావు. ఆఫీసు నుండి ఇప్పుడా రావడం అన్న వ్యంగ్యం ఉందా మాటల్లో. ‘ఆ,’ అంటూ ముక్తసరిగా సమాధానం చెప్పి ఇంట్లోకి నడిచాడు సూర్యం. ఇల్లంతా నిశ్శబ్దంగా ఉంది. శ్రీమతి వన్ ఫార్టీ ఫోర్ సెక్షన్ పెట్టినట్లుంది. హైదరాబాద్ పాత బస్తీలో అల్లర్లు జరిగాక ఉండే ప్రశాంతతలా ఉంది. అసలీపాటికి టీ.వీ. చూస్తూనో చిందులేస్తూనో హుషారుగా ఉండే పిల్లలు ఒక్కళ్ళూ కనబడ్డంలేదు. ప్రతి సాయంత్రం ఇంటికి రాగానే ‘నాకేం తెచ్చావ్’ అంటూ రౌడీ మామూలు వసూలు చేసే చిన్నారి కూడా రాలేదు. తెచ్చిన స్వీట్సు టేబిల్ పై ఉంచి అల్మారా వద్దకు నడిచాడు. లుంగీ తీసుకుని డ్రస్ ఛేంజి చేసుకుని, ముఖం కడిగి వాలు కుర్చీలో కూర్చున్నాడు సూర్యం.

“ఏవోయ్ శ్రీమతీ, ఏమిటీ విశేషాలు?” ప్రశాంత తను భగ్నం చేస్తూ పిలిచాడు. వాతావరణాన్ని తేలిక చేయాలని అతని ఉద్దేశం. సూర్యానికి ఇల్లంతా సందడిగా ఉండాలి. మౌనాన్ని భరించలేడు. అతను ఊహించినట్లుగానే అటు నుండి జవాబురాలేదు. పిల్లల మీది కోపం తన మీదకు మళ్ళిందని అర్థమైంది.

“ఆకలిగా ఉంది, నాకేమైనా పట్రా! అన్నాడు ప్రక్కనే ఉన్న వీక్లీ తీసుకుంటూ. ఓ పది నిమిషాలు మౌనమే రాజ్యమేలింది.

టీపాయ్ మీద విసురుగా బూందీ ప్లేటుంచి ఎంత విసురుగా వచ్చిందో అంతే విసురుగా వెళ్ళబోతూ అటువైపు గిరుక్కున తిరిగింది. చటుక్కున చేయందుకున్నాడు.

“పిల్లలేరి?” అన్నాడు చిలిపిగా

“బెడ్‌రూంలో తగలడి చదువుకుంటున్నారు.” అంటూ చేయి విదిలించినట్లు విడిపించుకుని విసవిసా వెళ్ళింది, తన సామ్రాజ్యంలోకి. సూర్యానికి కో పం తన్నుకు వచ్చింది. వెంటనే తమాయించుకున్నాడు. పిల్లలేదో గొడవచేసి ఉంటారు. లేదా తన్నుకొని ఉంటారు. తనుంటే వాళ్ళు అల్లరి చేయరు. వాళ్ళు తనమాట వినరంటుంది. తను ఆఫీసు వదలగానే ఇంటికి రాలేదని కోపం. పిల్లల ముందు మాటలు పెంచడం ఇష్టంలేదు తనకి.

* * * * * *

“మీరీ మధ్య అసలు ఇల్లే పట్టించుకోవడం లేదు. పిల్లలు మరీ విసిగిస్తున్నారు. నామాట వినడంలేదు. అసలు చదవడమే లేదు. అల్లరి బాగా ఎక్కువైంది,” షర్టు గుండీలు పెడుతూ అన్నది శ్రీమతి. సాయంత్రం సంఘటనను వివరించాలని తన ఉద్దేశం. “ఏమైంది? అన్నాడు అసలు విషయం తనే వివరంగా చెప్తుందని.” చిట్టి తల్లి నామాట వినడం లేదు. మీరేమో దానికి బాగా అలుసిచ్చారు, మొదటిది ఆరోపణ రెండవది దానికి కారణం తనే అని నిక్కచ్చిగాచెప్పడం.

...........

“చిన్నది బాగా ఎదురుచెప్తోంది.”

............

“ఈ మధ్య అది కూడా మీ బాటలోనే నడుస్తోంది. బడి నుండి తిన్నగా ఇంటికి రావడంలేదు ఈవేళ మీరు రావడానికి పావుగంట ముందు వచ్చింది. బట్టల నిండా బురద, చేతులు గీరుకుపోయి ఉన్నాయి. ఏమైందే, అంటే బెల్లం కొట్టిన రాయిలా ఉలకదు, పలదు.

మొత్తం చెపితే గాని తనకు తృప్తి ఉండదు.

అందుకే చెప్పిందంతా విన్నాడు

“కొట్టావా?” అన్నాడు కొంచెం సీరియస్‌గా.

“కొట్టక ముద్దు పెట్టుకుంటారా?” అన్నది తన చర్యను సమర్థించుకుంటూ.

“పిల్లల్ని కొట్టవద్దని నీ కెన్నిసార్లు చెప్పాను. బెట్టుగా మంచి మాటలతో చెప్పుకోవాలి, లేదా బెదిరించాలి” అన్నాడు సూర్యం. పిల్లలను కొడితే సహించలేడు.

“ఆ! అదొక టే తెలుసు. పిల్లల్ని మాత్రం బాగా వెనకేసుకొస్తారు. వీళ్ళని పెంచడం నావల్ల కాదు నేను మా ఇంటికి వెడతాను. మీ పిల్లల్ని మీరే బాగా చూసుకోండి,” అన్నది గద్గదస్వరంతో.

రాణీ స్వభావమే అంత. ఏదీ అర్థం చేసుకోదు. పిల్లలు తెలియక మాట్లాడితే ఎదురు తిరిగారంటుంది. ఎగిరెగిరి పడుతుంది. మళ్ళీ తానే ఏడుస్తుంది. కొన్ని విషయాల్లో మరీ మొండిగా ప్రవర్తిస్తుంది. మనసులో తన పట్ల, పిల్లల పట్ల అపారమైన ప్రేమ ఉంటుంది. వాళ్ళను పెంచడం కుదరక, పని చేత గాకనే ఈ వ్యవహార మంతా.

“మీకు ఎప్పటి నుండో చెప్తున్నాను. పిల్లలకు నా మాటంటే లెక్క లేకుండేటట్లు తయారుచేశారు. వాళ్ళకు నేనన్నా మా వాళ్ళన్నా అలుసు,” దెప్పి పొడుస్తూ, రోషంగా అంది.

“పిచ్చి! నీకెన్నిసార్లు చెప్పాను. నీ వాళ్ళు నా వాళ్ళు అనే వేరుభావం మనకొద్దు. మనవాళ్ళు అనాలి. నా దృష్టిలో అంతా ఒకటే. కాకుంటే బావ మరుదులు కాబట్టి పిల్లల్ని నవ్వించడానికి సరదాగా మాట్లాడతాను. అంతేగాని వాళ్ళ పట్ల నాకు అభిమానం, గౌరవం ఉందని నీకు తెలియదూ,” అన్నాను ఆప్యాయతగా!

“నేను మా ఇంటికి వెడతాను. పిల్లల్ని మీరే చూసుకోండి. కొట్టకుండా పెంచడం నావల్ల కాదు.” అంది, ఉక్రోషంగా. ఎందుక్కొట్టావు, అని కసిరినందుకే ఈ ఉక్రోషం అని తనకు తెలుసు. రాణీ ఏదైనా తనకు నచ్చినట్లు చేస్తుంది. “ఇదేమిటి? అంటే” “నాకు తెలిసింది ఇంతే. నేను చేసేది ఇంతే. మీ కిష్టంలేకపోతే చెప్పండి, మా ఇంటికి

పోతాను" అంటుంది.

రాజుకన్నా మొండివాడు బలవంతుడు.

"నన్నేం చేయమంటావు." అన్నాడు సూర్యం తను చెప్పినట్లు వింటాడనే భావం కలిగించటానికి.

"నాకేం తెలుసు. నాకన్నీ తెలిస్తే ఈ కొంప ఇలా ఎందుకేడుస్తుంది" నా మాటలు నాకే ఒప్పు చెప్పింది. నేనేం మాటాడలేదు. ఒక్క నిముషం మౌనం.

"నేను అమాయకురాల్ని కాబట్టే మీ ఆట లిలాసాగుతున్నాయి. పెళ్ళయిన నాటినుండి మీ మాట నేను వినడమేగాని నా మాట మీరు వినడం ఏనాడైనా జరిగిందా? మీ దృష్టిలో నేను చేతకాని దాన్ని. మావాళ్ళు పనికి మాలిన వాళ్ళు. అలా అన బట్టే పిల్లలు నా మాట వినకుండా పోయారు" సాధింపు ధోరణిలో సాగుతోంది వాక్ప్రవాహం. దేన్నైనా తట్టుకోవచ్చుగాని, సాధింపుని తట్టుకోలేం.

పెళ్ళయిన కొత్తల్లో కొన్ని విషయాల్లో రాణిలో కొన్ని మార్పులు తేవాలని చాలా ప్రయత్నం చేశాడు సూర్యం. ఆ విషయంలో ఇద్దరికీ ఘర్షణలు ఎక్కు వయ్యాయి. స్త్రీని అర్థం చేసుకుని, తనతో సమా నంగా చూడాలనే ధోరణి అతనిది. తిట్టడం, కొట్ట డం అనేవి పశు ప్రవృత్తిగా భావించేవాడు సూర్యం. తన మాటలర్థం చేసుకోకపోగా, తిరిగి మాటాడ్డం అలవాటు చేసుకుంది రాణి. తన మార్గానికి ఆమె రాదు కాబట్టి ఆమె త్రోవలోకి తను వెళ్ళినట్లు వెళ్ళి, ఆపైన నెమ్మ దిగా చెప్పుకుంటూ సాఫీగా జీవనం సాగించడం అలవాటు చేసుకున్నాడు.

ఆ మసక వెలుతురులో గోడమీద ఫోటోవైపు చూస్తున్నాడు సూర్యం. రెండు సంవత్సరాల నాటి సంఘటనను జ్ఞప్తి తెచ్చుకున్నాడు. అతను బజారు నుండి ఇంటికి వచ్చేసరికి వంట ఇల్లు అధ్వాన్నంగా ఉంది. పిల్లలు స్నానాలు కూడా చేయలేదు. పళ్ళాల్లో అన్నం కెలికి ఉంది. వంటింటి నిండా అన్నం.

"రాణీ! పిల్లలకు అన్నం పెట్టేది ఇలానా. కాస్త శుచి శుభ్రం నేర్చుకో" అన్నాడు మందలింపుగా.

"ఇంతకన్న నావల్లకాదు. ఐనా వాళ్ళకు అన్నం పెడుతూ కూర్చుంటే ఇంతపని ఎప్పుడవుతుంది" అన్నది లెక్కలేకుండా.

"ఎంత పనంటావు. పని కాస్త తొందరగా చేయడం నేర్చుకో. మరీ ఎక్కువైతే నా సాయం అడగొచ్చుగా" అన్నాడు.

ఉవ్వెత్తున లేచింది తన పైకి.

"నాకు పనులు రావని చెప్పడం ఎందుకు. బాగా పని వచ్చిన వాళ్ళను చేసుకొని వుండచ్చుగా. నన్నెందుకు ఏరికోరి కట్టుకోవడం. ఇంతోటి సాయం. ఇక నుండి మీరు చేయనక్కరలేదు నేనే చేసుకుం టాను". తనను ఆపడం ఎవరితరం కాదు.

ఆసాయంత్రం పిల్లలకు స్నానం చేయించనూ లేదు అన్నం పెట్టనూ లేదు. "మీ పిల్లలను మీరే చూసుకోండి నాకు చేతకాదన్నారుగా" అంది. ఆ మాటలు తల్చుకుంటే తనకు నవ్వువస్తుంది. అమాయకంగా, మొండిగా మాటాడే రాణి మొహం గుర్తుకొస్తే నవ్వు ఆగదు.

ఇదంతా రాణి పెరిగిన వాతావరణ ప్రభావం అతి గారాబంగా పెరగడం కూడా కావచ్చు.

"ఎందుకా నవ్వు. నేను చెప్పేది వింటున్నారా? లేదా?" అంది నన్ను కుదుపుతూ.

"వింటున్నానోయ్. ఐనా చూడు రాణీ! ప్రతి విషయాన్ని సీరియస్‌గా తీసుకుని బాధపడకు. అంత సున్నితమైన హృదయమైతే ఎలా?" అన్నాడు అనునయంగా.

"నాకేం రోగం. బాగానే ఉన్నానుగా" అన్నది బింకంగా.

"రోగం కాదోయ్. నీవు సంతోషంగా ఉంటేనే మేమంతా ఆనందగా ఉండేది. పిల్లలు తండ్రి లేక పోయినా బ్రతగ్గలరేమో. తల్లి లేకుంటే బ్రతకలేరని పెద్దల మాట."

"అదేమో నాకు తెలియదు" అంది కన్నీళ్ళు తుడుచుకుంటూ.



కాఫీ, డికాక్షన్ కోసం చాలామంది నీటిని బాగా మరిగించి అందులో పొడి వేసి మరింత మరగబెడతారు. దీనివల్ల కాఫీ కమ్మగా వుండదు. రాత్రిపూటే నీరు మరగకాచి ఒక గిన్నెలో కాఫీ పొడి వేసి అందులో మరిగిన నీటిని అవసరమైన మేరకు పోసి మూతవేసి వుంచండి. తెల్లవారి డికాక్షన్ కావలసినంత తీసుకొని వెచ్చచేసి పాలు కలుపుకుంటే కాఫీ ఎంతో కమ్మగా వుంటుంది. కాఫీ పొడి కూడా ఎంతో కలిసి వస్తుంది.

- ప్రియాశ్రీ

"అనవసరంగా దాన్ని కొట్టాను." అంది మరలా తనే.

ఉరుములు ఉరిమి, పిడుగులు కురిపించి ఉధృతంగా కురిసిన గాలివాన ఆగింది. ప్రతి సంఘటనకు ముగింపు ఇలాగే ఉంటుంది తమ సంసారంలో.

* * * * * *

పక్కింటి రాజారావు గారికి సీరియస్‌గా ఉందని విని, పరామర్శించి వచ్చేసరికి ఇంట్లోనుండి శ్రీమతి అరుపులూ, కేకలూ వినిపిస్తున్నాయి. కవిత ఏడుపు కూడా వినిపిస్తోంది.

"చెప్పవే చెప్పు అవన్నీ ఎందుకు. ఎక్కడి నుండి తెచ్చావు. ఆ దరిద్రపు పల్లెటూరు లక్షణాలు ఇంకా పోలేదు." అంటూ అత్తగారి ఊరిమీద, వాళ్ళ మీద అయిష్టాన్ని కూడా ప్రదర్శిస్తోంది.

"రాణీ! ఆగు" అంటూ ఒక్క ఉదుటను వెళ్ళి చేతిలో కర్రను లాగి విసిరేసి కవితను దగ్గరకు తీసుకున్నాడు సూర్యం.

"పిల్లల్ని కొట్టవద్దని నీకెన్నిసార్లు చెప్పాను," అన్నాడు తీవ్రంగా. 'అసలేం జరిగింది' అని ప్రశ్నిం చాడు సర్దుబాటు ధోరణిలో.

"ఏం జరిగిందో ఇటు చూడండి. దాని పెట్టెలో ఏముందో" అంటూ స్కూల్ బాక్సును పామును చూపించినట్లు చూపించింది.

"ఏమిటమ్మా? ఏమున్నాయందులో" అంటూ పెద్దకూతుర్ని ప్రశ్నించాడు.

పుట్టలోని పెద్ద నాగుపామును తీసినట్లు ఒక్క ఉదుటున పెట్టె తెరచి అందులోని ఒక కవరు తీసింది. ఆ కవరులో పేడ ఉంది. అందులోనే చిన్న బ్లేడు, ఏవో రెండు చిన్న కొమ్మలు కుదురీ కుదర నట్లుగా అంటు కట్టి ఉన్నాయి.

"ఇవి ఎందుకే అని ఎంత అడిగినా చెప్పదు. చదువుకోవే అని కూర్చోపెడితే నన్ను స్నానానికి పోనిచ్చి ఎదురింటి మహాలక్ష్మిగారి గెదె కొట్టం నుంచి ఇవి తెచ్చింది. ఇవి మన మల్లెగులాబీ కొమ్మలు. ఇక ఈ న్యూసెన్స్ భరించలేను.

"ఇవ్వాళ నా చేతిలో నీకు మూడిందే." అన్నది కోపంగా. నాకు నవ్వు ఆగలేదు. ఆ సమయంలో నవ్వానో రాణికి పిచ్చి ఆవేశం వస్తుంది.

"రాణీ! తొందరపడకు. చెప్పమ్మా నేనేమీ అననుగా" అన్నాను. విషయం నాకర్థమైంది.

ఏడుస్తూనే ముద్దు ముద్దుగా తను చేస్తున్న పని వివరించింది. వాళ్ళ స్కూల్లో పర్యావరణ ఉద్యమం ఏర్పాటు చేశారని, అందులో భాగంగా స్థానిక మంత్రిగారు నాటే చెట్లు - ప్రగతికి మెట్లంటూ వివరించి, కాలుష్య నివారణ మార్గాలను వివరించా రట. ఆ వెంటనే ఈ పసిడి మనసుల పసి బాలలు కూడా తలా ఒక మొక్కను నాటారుట. ఆగష్టు 15 నాటికి ఎవరి చెట్టు ఏపుగా పెరిగితే వారికి మంచి బహుమతినిస్తామని చెప్పారట. తన క్లాసులో అందరి కంటే పోటీగా తాను ఆ మొక్కను పెంచుతున్నట్లు, దానికి తోడుగా మల్లె, గులాబీ నాటాలని ఈ ప్రయ త్నం చేసినట్లు చెప్పింది.

"మమ్మీకి చెప్పి, మమ్మీ పర్మిషన్ తీసుకొని చేయవచ్చుగదా! అమ్మకు కోపం తెప్పించవచ్చా" అన్నాడు సూర్యం మందలింపుగా.

"చదువూ లేదు. సంధ్యా లేదు, అన్నీ పాడు బుద్ధులూ పాడు కళలూనూ" అంది రాణి ఇంకా కోపంగా.

"రాణీ! అలా అనకు. ఎదిగే పిల్లలు ఎదిగే మొక్కల్లాంటి వారు. ఆయన చెప్పిన మంచి మాట లని ఆచరణలో పెట్టి ఈ భావి భారత పౌరులు అందులోని అవసరాన్ని గుర్తించి రాబోయే కాలాన్ని నందనవనంలా తీర్చిదిద్దనీ. నిరంతర యాంత్రిక జీవనంలో, బ్రతుకు తెరువుకోసం, ఆర్థికంగా ఎదగా లనే పోరాటంలో మనం మరచిన, వదలిన ఈ మంచి పనులను మనవారసత్వం అమలు పరచే టట్లయినా చేద్దాం" అన్నాడు ఆవేశంగా.

"వెరీగుడ్ మంచి పనులు చేస్తున్నావు నా చిన్నారి," అంటూ ముద్దు పెట్టాక అతని మాటలు అర్థంగాకపోయినా ఆ చిట్టి తల్లికి ఆనందం కలి గించాయి.

రాణికి మాత్రం ఇది అర్థమయ్యిందో లేదో మౌనంగా వుండిపోయింది.